# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 06-06-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక అస్థిరత, సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ఆర్థిక సలహా మండలి సభ్యులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

- ❖ అంతర్జాతీయ సరిహద్దు వెంబడి భద్రతను పటిష్ఠంగా నిర్వహించేందుకు భారత్, నేపాల్ అత్యంత సన్నిహితంగా సహకరించుకుంటున్నాయని కేంద్రమంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు.

- ❖ ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలు ఆర్థిక అనిశ్చితిని ఎదుర్కొంటున్న వేళ.. భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలుస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

- ❖ దేశంలో నైరుతి రుతుపవనాల విస్తరణ వేగంగా సాగుతోందని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ఆర్థిక సలహా మండలి (PM-EAC) సభ్యులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక అస్థిరత, సంక్షోభ పరిస్థితుల మధ్య భారతదేశ ఆర్థిక వృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు తీసుకోవాల్సిన వివిధ వ్యూహాలు, చర్యలపై ఈ భేటీలో చర్చించారు. దీంతో పాటు దేశంలో వ్యాపార సానుకూల వాతావరణాన్ని (Ease of Doing Business), ప్రజల జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు చేపట్టాల్సిన పలు సంస్కరణలపై చర్చించారు. పశ్చిమాసియా ఘర్షణల ప్రభావం అంతర్జాతీయ మార్కెట్లతో పాటు.. భారత ఆర్థిక వ్యవస్థపై ఏ మేరకు పడుతుందనే అంశంపై సలహా మండలి సభ్యులు తమ అంచనాలను ప్రధానికి వివరించారు. ఈ భేటీ అనంతరం నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం వేదికగా స్పందిస్తూ.. దేశ ఆర్థిక పరివర్తన, దీర్ఘకాలిక అభివృద్ధి ప్రాధాన్యతలకు సంబంధించిన విస్తృతమైన అంశాలపై ఈ సమావేశంలో చర్చించామని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలు ఆర్థిక అనిశ్చితి, అస్థిరత ఎదుర్కొంటున్న వేళ.. భారత్ మాత్రం అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలుస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశం 7.7 శాతం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటును నమోదు చేయడం విశేషమన్నారు. గత 12 ఏళ్లుగా దేశ ఆర్థిక పునాదులను బలోపేతం చేసేందుకు తీసుకున్న పటిష్ఠ చర్యల వల్లే ఈ విజయం సాధ్యమైందని, ఇది భారత ఆర్థిక వ్యవస్థ అంతర్గత సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు రాజ్‌నాథ్ సింగ్ సామాజిక మాధ్యమం వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమర్థ నాయకత్వంలో భారతదేశం ఆర్థిక వృద్ధితో పాటు స్థిరత్వం, ఆత్మవిశ్వాసం, పర్యావరణ హిత ప్రగతి, అంతర్జాతీయ విశ్వసనీయతలను అందిపుచ్చుకుందని కొనియాడారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సుదీర్ఘమైన, విశేషమైన అంతర్జాతీయ సరిహద్దు వెంబడి భద్రతను పటిష్ఠంగా నిర్వహించేందుకు భారత్, నేపాల్ దేశాలు అత్యంత సన్నిహితంగా సహకరించుకుంటున్నాయని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. కష్ట సమయాల్లో ఇరు దేశాలు ఎల్లప్పుడూ ఒకరికొకరు అండగా నిలిచాయని ఆయన గుర్తు చేశారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం భారత్ వచ్చిన నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ తో జైశంకర్ న్యూఢిల్లీలో ఈరోజు ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... నేపాల్ ప్రభుత్వ ఆకాంక్షలకు, భారతదేశం తన పొరుగు దేశాల ప్రయోజనాల కోసం చేపడుతున్న వివిధ కార్యక్రమాలకు ఎంతో సారుప్యత ఉందని అన్నారు.

(వాయిస్ 30 సెకన్లు)

నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ మాట్లాడుతూ.. నేపాల్‌కు భారతదేశమే అత్యంత ముఖ్యమైన భాగస్వామి అని, తమ దేశ దౌత్య విధానాల్లో భారత్‌కు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (CBSE) మార్కుల ధృవీకరణ, రీ-ఎవాల్యుయేషన్ కోసం దరఖాస్తులు సమర్పించే గడువును రేపటి వరకు పొడిగించింది. ఈ మేరకు సామాజిక మాధ్యమం వేదికగా సీబీఎస్ఈ ఒక ప్రకటన విడుదల చేసింది. విద్యార్థులు తమ దరఖాస్తులను ఆదివారం అర్ధరాత్రి వరకు ఆన్‌లైన్ ద్వారా సమర్పించవచ్చని బోర్డు స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రతిష్ఠాత్మక `పద్మ పురస్కారాలు-2027` ప్రతిపాదనలు సమర్పించేందుకు జూలై 31వ తేదీ వరకు గడువు ఉందని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మార్చి 15న ప్రారంభమైన ఈ నామినేషన్ల ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేసింది. అర్హులైన వారి వివరాలను కేంద్ర ప్రభుత్వ అధికారిక `రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్` ద్వారా మాత్రమే పంపాలని సూచించింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్‌లో ఈరోజు జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం పట్ల వారు సంతాపం ప్రకటించారు. ప్రమాద ఘటనపై రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి సామాజిక మాధ్యమాల వేదికగా స్పందిస్తూ.. తమ వారిని కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రధాని నరేంద్ర మోదీ మృతుల కుటుంబాలకు తన ఓదార్పును తెలియజేస్తూ.. క్షతగాత్రులు త్వరితగతిన కోలుకోవాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు 2 లక్షల రూపాయలు, గాయపడిన వారికి 50 వేల

రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గత 12 ఏళ్లలో భారత సౌర శక్తి సామర్థ్యం 2.8 గిగావాట్ నుంచి 155 గిగావాట్ వరకు పెరిగిందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలిపారు. ఈరోజు ఆయన సామాజిక మాధ్యమం వేదికగా దేశ ప్రగతిని వివరిస్తూ.. ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 40 లక్షలకు పైగా ఇళ్లు సౌర శక్తితో వెలుగులు అందిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో సౌర విద్యుత్ సామర్థ్యం రెట్టింపు కావడం.. పర్యావరణ పరిరక్షణతో కూడిన దేశ ప్రగతికి సజీవ సాక్ష్యమని కొనియాడారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ మార్కెట్‌లో లభించే వంటనూనెల ప్యాకెట్ల పరిమాణంలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులు తీసుకువచ్చింది. మార్కెట్‌లో మరింత పారదర్శకత, ఏకరూపతను తీసుకువచ్చే లక్ష్యంతో లీగల్ మెట్రాలజీ నిబంధనల పరిధిలో వంట నూనెలకు నిర్దేశిత ప్రామాణిక ప్యాక్ పరిమాణాలను (Standard pack sizes) కేంద్రం తప్పనిసరి చేసింది. కొత్త మార్గదర్శకాల ప్రకారం.. ప్యాకింగ్ పరిమాణాలు 200 గ్రాములు, 500 గ్రాములు, 1 నుంచి 5 కిలో గ్రాములు, 15 కిలో గ్రాములు, 20 కిలోగ్రాములుగా వున్నాయి. నూతన నిబంధనలు దేశంలోని అన్ని ప్రధాన వంట నూనెలకు వర్తిస్తాయని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

చండీగఢ్‌లో అఫ్గానిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ మొదటి ఇన్నింగ్స్‌లో 3 వికెట్ల నష్టానికి 368 పరుగులతో పటిష్ఠ స్థితిలో నిలిచింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్ శతకాలు చేయడంతో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆధిపత్యం లభించింది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (BCCI) ఈరోజు ఇంగ్లాండ్, ఐర్లాండ్ పర్యటనలకు 16 మంది సభ్యుల టీ20 అంతర్జాతీయ భారత జట్టును ప్రకటించింది. శ్రేయాస్ అయ్యర్ కు కొత్త టీ20 కెప్టెన్‌గా, తిలక్ వర్మ కు వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు అప్పగించింది. ఈ జట్టులో యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ తొలిసారి చోటు దక్కించుకున్నాడు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో నైరుతి రుతుపవనాల విస్తరణ వేగంగా సాగుతోందని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది. ఇప్పటికే కర్ణాటక, తమిళనాడు సహా మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించాయని వాతావరణ విభాగం స్పష్టం చేసింది. వీటి ప్రభావంతో రానున్న వారం రోజుల పాటు దేశంలోని పలు రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కేరళం రాష్ట్రానికి అత్యంత భారీ వర్ష సూచనతో కూడిన రెడ్ అలర్ట్ జారీ చేయగా, ఈశాన్య రాష్ట్రాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. రాజస్థాన్, ఒడిశా రాష్ట్రాల్లో రానున్న రోజుల్లోనూ వడగాలుల పరిస్థితులు కొనసాగుతాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రభుత్వ సెక్యూరిటీలలో విదేశీ పోర్ట్ ఫోలియో పెట్టుబడిదారుల (FPI) పెట్టుబడులకు సంబంధించి భారతీయ రిజర్వ్ బ్యాంక్ (RBI) కీలక మార్పులను ప్రకటించింది. విదేశీ పెట్టుబడులను మరింత సులభతరం చేయడంతో పాటు, నిబంధనల ప్రక్రియను సరళీకరించడమే లక్ష్యంగా ఈ కొత్త నియంత్రణ చట్రాన్ని తీసుకువచ్చింది. నూతన నిబంధనల ప్రకారం.. సాధారణ మార్గం ద్వారా పెట్టుబడులు పెట్టే ఎఫ్‌పీఐలకు ఇకపై స్వల్పకాలిక పెట్టుబడి పరిమితులు, సెక్యూరిటీల వారీ పరిమితులు, కేంద్రీకృత పరిమితుల నుంచి మినహాయింపు లభించనుంది.